క్లుప్తంగా

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




రాపాక అమృత వర్షిణి గుడాల టాటు శ్రీలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా భీమవరం విష్ణు విద్యా సంస్థలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పోడూరు మండలం చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులు రాపాక అమృత వర్షిణి (ద్వితీయ స్థానం), గుడాల టాటు శ్రీలక్ష్మి (తృతీయ స్థానం) సాధించారు. విజేతలు ఇద్దరూ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి జి.విజయ కుమార్, జీవీ సూర్యనారాయణ, ఎండీఎంఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త కుక్కల కృష్ణారావు, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద, హెచ్ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్, రాయపూడి భవానీప్రసాద్ తదితరులు అభినందించారు.

నిత్యావసర ధరలను కట్టడి చేయాలి



మొగల్తూరు మసీదు సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మొగల్తూరు: రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను అరికట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మసీద్ సెంటర్లో కార్మికులు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నిత్యావసర ధరలు తగ్గిస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిత్యావసర ధరలు తగ్గించాలని, వస్తువులపై విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు, కొల్లాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖధారమ్మకు అంబలి సమర్పణ



అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: దేవిశరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రివి చెరువుగట్టున ముఖధారమ్మ కాలనీ, హనుమాన్ కమిటీ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి 10వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి రోజుకో అలంకరణ చేస్తున్నారు. మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహిళలు స్థానిక శ్రీ ముఖధారమ్మకు అంబలి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వల్లూరులో పొలం పిలుస్తోంది



వల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సాగులో ఖర్చు తగ్గించి, దిగుబడులు అధికంగా సాధించడానికి పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నట్లు ఆచంట మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు అన్నారు. మంగళవారం ఆచంట మండలం వల్లూరులోని మట్టవాని చెరువులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉందన్నారు. తెగుళ్లు , పురుగుల ఉధృతి తక్కువగానే ఉన్నాయన్నారు. అనవసరంగా పురుగు మందులు పిచికారి చేయవద్దని సూచించారు. చిరుపొట్ట దశలో పొటాష్ ఎరువును ఎకరానికి 20 కిలోలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి బేబీ పాల్గొన్నారు.

నేడు ఐటీఐ సర్టిఫికెట్ల అందజేత

ఉండి: ఉండి ఎన్నార్పీ అగ్రహారం(భీమవరం)లోని ప్రభుత్వ ఐటీఐ పాస్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్, ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సి.నాగరాణి, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ సామంతపూడి బాలకృష్ణంరాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- జేబు ఖాళీ అవుతున్నా సంచి నిండని వైనం
- ఆకు కూరలదీ అదే బాట



రైతు బజార్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రోజురోజుకూ మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు కూరగాయలు ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగిందని, కొనుగోలు తగ్గిందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులపై మరింత ఆర్థిక భారం పడుతుంది. సుమారు నెల రోజుల క్రితం వరకూ ధరలతో పోలిస్తే నేడు కొన్ని కూరలు రెట్టింపు, మరికొన్ని కూరలు అంతకు మించిపోయాయి. ఫలితంగా పేద, సామాన్య ప్రజానీకానికి కూరలు భారంగా మారాయి. కూరగాయల దిగుబడి తగ్గిపోవడంతో పాటు దసరా నేపథ్యంలో డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగిపోయాయి.

తగ్గిన దిగుమతులు

గతంలో పంటలు దెబ్బతింటే పొరు గు జిల్లాల నుంచి కూరగాయలు దిగుమతయ్యేవి. వర్షాలు పడి మళ్లీపంటలు కాపుకు వచ్చే వరకూ ధరలు దిగొచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. రూ.500పెట్టినా వారానికి సరిపడా కూర గాయలు రావడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. అయితే పెరిగిన కూరగాయల ధరల నేపథ్యంలో కర్రీ పాయింట్లను ఆశ్రయించే వారు పెరిగారు. ఈ నేపథ్యంలో వారు కూడా కూరలను గతం కంటే తగ్గించి ప్యాక్ చేస్తున్నారు.

కొనలేకపోతున్నాం



ప్రస్తుతం మార్కెట్లో కూరగాయలను పెరిగిన ధరల వల్ల కొనలేకపోతున్నాం. సుమారు నెల రోజుల క్రితం రేట్లకు ఈ రోజున రేట్లకు ఏ మాత్రం పొంతన లేదు. డబ్బులు పెట్టినా నాణ్యమైన కూరలు దొరకడం లేదు. అలాగని కర్రీ పాయింట్లలో కూరల కోసం వెళ్లే అక్కడ కూడా అధిక ధరలు వెచ్చించాల్సి వస్తుంది.

– రెడ్డి ఆశాజ్యోతి, గృహిణి, నరసాపురం

దడ పుట్టిస్తున్న ధరలు



రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు మాలాంటి చిరుద్యోగులకు దడ పుట్టిస్తున్నాయి గతంలో రూ.500 తీసుకెళ్తే చేతి సంచి నిండా కూరలు వచ్చేవి. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 వెచ్చించినా వారానికి సరిపడా కూరగాయలు తెచ్చుకోలేని పరిస్థితి.

– జి.ప్రభాకరరావు, చిరుద్యోగి, నరసాపురం

అమ్మకాలు తగ్గాయి



నరసాపురం తీర ప్రాంతంలో చాలా రకాల కూరగాయలు పండించే వాళ్లం. గ్రామాల్లో ఎక్కడిక్కడ కూరగాయలు, ఆకుకూరలు, దొండ, బీర, పొట్ల తదితర పాదులు దెబ్బతిని పంటల దిగుబడి భారీగా తగ్గిపోయింది. దీంతో ప్రస్తుతం కాయగూరల ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. ధరలు పెరగడంతో వ్యాపారాలు కూడా తగ్గాయి. ప్రస్తుతం అమ్మకాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.

– వై.సత్యనారాయణ, కూరగాయల వ్యాపారి, నరసాపురం

రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలి



నరసాపురం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

నరసాపురం: అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి, దళితులపై అనుచితంగా ప్రవర్తించిన ఉండి టీడీపీ ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం పుష్పరాజ్ దళిత నాయకులతో కలిసి నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపివేయడం దారుణమన్నారు. ఇప్పటివరకూ అతనిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం ఇంకా దారుణమని పేర్కొన్నారు. రఘురామకృష్ణరాజు చేసిన తప్పుకు క్షమాపణ చెప్పాలని, లేదంటే అతనిని దళితవాడల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఇంటి సుందర్‌కుమార్, కార్యదర్శి చిట్టి రాజ్‌కుమార్, కోలాటి ప్రసాదరాజు, గడ్డం అబ్రహం, పిల్లా వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

దళిత నేతల హౌస్ అరెస్టులు దారుణం




చిట్టవరంలో కాకిలేటి ఆనందకుమార్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఉండి నియోజకవర్గంలో కాళ్ల మండలం ఏలూరుపాడు లో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలు చించివేసి అవమానపర్చినందుకు నిరసనగా చేస్తున్న కార్యక్రమాలను అడ్డుకోవడంలో భాగంగా దళిత నేతలను హౌస్ అరెస్టు చేయడం తగదని మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు, నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనందకుమార్ (మధు) అన్నారు. ఎమ్మెల్యే చర్యలను నిరసిస్తూ మంగళవారం కాళ్ల పోలీస్ స్టేషన్ ముట్టడికి దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమానికి బయలుదేరి వెళుతున్న మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు, నియోజకవర్గ మాలల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనందకుమార్ (మధు)ను మంగళవారం ఉదయం నరసాపురం మండలంలోని చిట్టవరం గ్రామంలోని ఆయన నివాసం వద్ద గృహనిర్బంధం చేశారు. దళిత వ్యతిరేకి అయిన రఘురామకృష్ణరాజుకు త్వరలోనే దళిత సంఘాలు తగిన గుణపాఠం చెబుతాయని మధు పేర్కొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే



పెనుగొండ: మహాలక్ష్మీ దేవిగా వాసవీ శాంతి ధాంలోని వాసవీ మాత



పెనుగొండ: మహాలక్ష్మీదేవిగా పెనుగొండ మూలవిరాట్ వాసవీ మాత



పాలకొల్లు అర్బన్: లలితాదేవి అలంకరణలో దేవీ చౌక్ సెంటర్‌లోని దుర్గమ్మ



మొగల్తూరు: పేరుపాలెం నార్త్ రజకులపేటలో మహాలక్ష్మీదేవి అలంకరణ



యలమంచిలి: అడవిపాలెంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసాపురం: స్టీమర్‌రోడ్డులో కాత్యాయనీదేవి అలంకరణ



నరసాపురం రూరల్: వేములదీవి గొందిమూలలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దాదాపు అన్ని ఆలయాల్లో అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అలంకరణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. అనంతరం మహాలింగార్చన నిర్వహించారు. మహిషాసురమర్దనీ, మూలవిరాట్ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించి అర్చనలు, కుమారి పూజలు నిర్వహించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతిధాంలో మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: గ్రామాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ ఆలయ ఆవరణలో విజయదశమి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రులు ఆరో రోజు మంగళవారం అర్చకులు గుబ్బల పురుషోత్తం బ్రహ్మత్వంలో తంగెళ్ల సంజీవరావు-దేవి , దూసబోయిన నాగ శ్రీనివాసరావు-లక్ష్మీ భారతి దంపతులతో విఘ్నేశ్వరుని పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు

మొగల్తూరులో...

మొగల్తూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. మొగల్తూరులోని పార్వతీ దేవి ఆలయం, కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. కూరగాయల మార్కెట్, వడయార్‌పేట, సత్రవుపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం, జగన్నాదపురం, కాళీపట్నం, రామన్నపాలెం గ్రామాల్లోని ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నరసాపురంలో..

నరసాపురం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం అన్ని మండపాలు, అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పండ్ల మార్కెట్ వద్ద జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారు కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణ, చిట్టూరి కృష్ణ, గునిశెట్టి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. గోల్డ్‌మార్కెట్ వద్ద స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో అమ్మవారిని వెండి వస్తువులతో అలంకరించారు. గడ్డిబజార్ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాయిపేట పుంతలో ముసలమ్మ ఆలయంలో పూజలు చేశారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఆరో రోజు వైభవంగా కొనసాగాయి. మంగళవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవార్ల చలువ పందిళ్లు దుర్గాదేవి నామంతో దద్దరిల్లాయి. సారవ గ్రామంలో ముత్యాలమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములదీవి గ్రామం గొందిమూల సెంటర్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి ని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కొప్పర్రు సెంటరులో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. లిఖితపూడిలోని ధానేశ్వరి అమ్మవారు, లక్ష్మణేశ్వరంలోని గోగులమ్మ అమ్మవార్లతో పాటు కె.బేతపూడి, సారవ గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. చిట్టవరం గ్రామంలోని అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చినమైనవానిలంక గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారిని అలంకరించి విశేషపూజలు కుంకుమార్చనలు చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం, పట్టణంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పాలకొల్లు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు దేవీ చౌక్ సెంటర్‌లో ఫ్రెండ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక అలంకరణ



మహంకాళేశ్వరునిగా క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా స్వామి వారిని మహంకాళేశ్వరునిగా అలంకరించారు. అలాగే అమ్మవారిని లలితాత్రిపురసుందరి దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప, కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

యలమంచిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు గ్రామానికి చెందిన చెల్లుబోయిన చైతన్య బాబు (21) అతని స్నేహితుడు గెడ్డం సూర్యకిరణ్ ఈ నెల 6న కాళ్ల గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరారు. చించినాడ వద్ద వశిష్ఠ గోదావరి నది వంతెన దిగుతుండగా ఎదురుగా వస్తున్న కారుని ఢీ కొట్టడంతో గాయపడ్డారు. సూర్యకిరణ్‌కు స్వల్ప గాయలవ్వగా, చైతన్య బాబు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చైతన్య బాబుని ఉన్నత వైద్యం నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మరణించాడు. ఈ మేరకు మృతుడి తండ్రి చెల్లుబోయిన వీరాంజనేయులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గారావు తెలిపారు.

పాత నేరస్తుల అరెస్టు

పాలకోడేరు: వివిధ చోట్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను మంగళవారం చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. చాగల్లు గ్రామానికి చెందిన డొక్కా సాయి కిరణ్ (24) , ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన మండా రాజేష్ (25)లు ఇద్దరూ కూడా దొంగతనాలకు అలవాటు పడ్డారు. వివిధ చోట్ల చోరీలు చేస్తూ మార్చి నెలలో గొరగనమూడి గ్రామానికి చెందిన నీలి వెంకట నాగ సాయి కుమార్ ఇంట్లో కొన్ని బంగారు ఆభరణాలు, లాప్ టాప్ దొంగిలించుకుపోయారు. ఫిర్యాదు అందుకున్న భీమవరం రూరల్ సీఐ పాలకోడేరు ఎస్సై ఎస్.హరిబాబు కేసును త్వరితగతిన విచారణ చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

ఎంపీటీసీ సభ్యుడిపై ఫిర్యాదు

పాలకోడేరు: గరగపర్రు ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు ఎస్సీ నేతలు భీమవరం సీఐకి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇప్పటికే శ్మశానవాటిక భూమిని చాలావరకు ఆక్రమించుకున్న పాపా సాహెబ్ మరింత ఆక్రమణకు యత్నిస్తుండగా అడ్డుకున్నామని తమపై కక్ష గట్టి అల్లరి సృష్టించి కులమతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సత్తోల జీవరత్నం, కోనాల ఎలీషా రావు ఫిర్యాదు చేశారు.

పంచాయతీల విధులు, బాధ్యతలపై అవగాహన



మొగల్తూరు: వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రిశూలపాణి



పాలకొల్లు అర్బన్: శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ తాళ్ల మూర్తిబాబు



పెనుగొండ: ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి

మొగల్తూరు: పంచాయతీల విధులు, బాధ్యతలపై వార్డు సభ్యులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి సూచించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుండి ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం పంచాయతీ సమావేశాలు, గ్రామ సభల పర్యవేక్షణ, కార్యదర్శి విధులు, బాధ్యతలు, అధికారాలు సభ్యులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, రిసోర్స్‌పర్సన్ కేఐఎన్ రాజు, ఉపాధి హామీ పథకం జేఈ ఆనంద్ టీఏ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పంచాయతీలో జరిగే పరిపాలన అంశాలపై ప్రతి వార్డు సభ్యుడూ అవగాహన కలిగి ఉండాలని మాస్టర్ ట్రైనీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్ల మూర్తిబాబు చెప్పారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ తరగతుల్లో ఆయన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాలమూరు కార్యదర్శి నాగయ్య, దిగమర్రు ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, గవరపేట ఉపసర్పంచ్ యల్లపు మణితో పాటు మండలంలోని 22 గ్రామ సచివాలయాల నుంచి 61 మంది పాలకవర్గ సభ్యులు హాజరయ్యారు.

పెనుగొండలో..

పెనుగొండ: గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ తోడ్పాటు నందించాలని ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. రిఫ్రెష్‌మెంట్ శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రామాల ఉపసర్పంచ్‌లు,, పంచాయతీ సభ్యులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మొదటి రోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి చెత్త నుంచి సంపద తయారీ, వీధి లైట్లు నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ఎస్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. గ్రామ పంచాయతీలలో సాధారణ కనీస పరిపాలనా విధానం, ఏపీ పీఆర్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు గురించి ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, ఈవోపీఆర్‌డీ జేడీపీ ప్రసాద్, రిసోర్స్ పర్సన్‌లు మాదాసు హరి ప్రసాద్, తోటకూర పవన్ కుమార్ వివరించారు.